# 205 ఆస్తులు..



# రూ.212 కోట్లు..

## పాతబస్తీ మెట్రో కోసం జోరుగా పరిహారం చెల్లింపులు

- రంజాన్ నేపథ్యంలో పనుల్లో కాస్త జాప్యం
- మళ్లీ వడివడిగా ముందుకు..
- ఇంకా 895 ఆస్తులను సేకరించాల్సిన పరిస్థితి



పాతబస్తీలో మెట్రో విస్తరణ పనుల కోసం భవనాలను కూలుస్తున్న దృశ్యం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పాతబస్తీ మెట్రో పనులు మళ్లీ పుంజుకున్నాయి. రంజాన్ పండుగ నేపథ్యంలో దాదాపు నెల రోజులకు పైగా ఓల్డ్‌సిటీ వైపునకు వెళ్లని హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఏఎంఎల్) అధికారులు వారం రోజులుగా కూల్చివేత పనులను ముమ్మరం చేశారు. ఇప్పటికే నష్టపరిహారం చెక్కులను స్వీకరించిన బాధితుల ఇళ్లు, కమర్షియల్ భవనాలను వేగంగా తొలగిస్తున్నారు. మెట్రో రెండో దశ విస్తరణలో భాగంగా కారిడార్-6 కింద ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల పనులను చేపడుతున్న విషయం తెలిసిందే. అయితే, ఈ మార్గంలో 1,100 ఆస్తులు ప్రభావితమవుతున్నట్లు హెచ్‌ఏఎంఎల్ అధికారులు గతంలో గుర్తించారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు 900 ఆస్తులకు నోటిఫికేషన్ జారీ చేయగా.. అందులో 400 ఆస్తులకు ప్రిలిమినరీ డిక్లరేషన్ ఇచ్చి నష్ట పరిహారం చెల్లిస్తున్నారు.

### రూ.1,100 కోట్ల కేటాయింపు

మొత్తం 1,100 ఆస్తుల సేకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.1,100 కోట్లను కేటాయించింది. ఈ మేరకు స్థానికులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పరిహారం అందజేస్తూ ముందుకుసాగుతోంది. 2028 ఎన్నికల్లోగా పాతబస్తీలో మెట్రో రైలును ప్రారంభించాలనే ఏకైక లక్ష్యంతో కాంగ్రెస్ సర్కారు పనిచేస్తోంది. ఇందులో భాగంగా 2023-24 బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించింది. అయితే గతేడాది సవరించిన రూ.106.88 కోట్లతో కలిపి తాజా బడ్జెట్‌లో మరో రూ.500 కోట్లు కేటాయింపులు చేసింది. కాగా, మొత్తం 1,100 ఆస్తుల్లో భాగంగా ఇప్పటివరకు 205 ఆస్తులను సేకరించి రూ.212 కోట్ల చెల్లింపులు చేశారు.

### వచ్చే నెలలోపు..

రంజాన్ పండుగ నేపథ్యంలో పాతబస్తీలో మెట్రో పనులను పూర్తిగా నిలిపివేశారు. కారిడార్ నిర్మాణంలో ఇళ్లను కోల్పోతున్న బాధితులను పండుగ సమయంలో ఇతర ప్రాంతాలకు పంపించొద్దనే ఉద్దేశంతో అధికారులు అటువైపు వెళ్లకుండా దూరంగా ఉన్నారు. అయితే రంజాన్ ముగిసిన తరుణంలో స్థానికుల సహకారంతో వారం రోజులుగా మళ్లీ పనులను పునఃప్రారంభించారు. రోడ్డుకు ఇరువైపులా చిక్కు ముడులుగా ఉన్న విద్యుత్‌వైర్లు, టెలిఫోన్ కేబుళ్లను హెచ్‌ఏఎంఎల్ ఇంజనీరింగ్ సిబ్బంది జాగ్రత్తగా తొలగిస్తున్నారు. వచ్చే నెలలోపు అన్ని నిర్మాణాలనూ తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు.

### స్వచ్ఛందంగా వస్తున్నారు..



మెట్రో కారిడార్ నిర్మాణంలో ఆస్తులను కోల్పోతున్న యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నష్టపరిహారాన్ని ఆమోదించి తీసుకెళ్తున్నారు. ఇప్పటికే రోడ్డు విస్తరణ కోసం లాహోటి భవనం, అక్బర్ ఫంక్షన్‌హాల్‌ను కూల్చి, వాటి శిథిలాలను అక్కడి నుంచి తరలించాం. షబ్బర్ కేఫ్, మీనా ప్లాజా, పిస్తాహౌజ్, స్వాగత్ హోటల్, లిల్లీ రోజ్ స్కూల్ తదితర భవనాల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి డీపీఆర్‌కు అనుమతి వచ్చిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

- ఎన్వీఎస్ రెడ్డి, హెచ్‌ఏఎంఎల్ ఎండీ